క్లుప్తంగా

ఖతార్‌లో ఆదిత్య సత్తా

ద వరల్డ్ స్కాలర్‌షిప్స్ క్యాంప్‌లో ద్వితీయస్థానం



మాచర్ల: ఖతార్ దేశంలో మనోడు ప్రతిభ చూపాడు. ద వరల్డ్ స్కాలర్‌షిప్స్ కాంప్‌లో ద్వితీయ స్థానం సాధించాడు. వివరాలు.. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు మురహరిరావు, కల్పనాదేవి కుమారుడు వెంకట దినేష్, మాధవి దంపతుల కుమారుడు వెంకట ఆదిత్య. ఖతార్ దేశపు రాజధాని దోహాలో ఇటీవల ద వరల్డ్ స్కాలర్‌షిప్స్ క్యాంప్ నిర్వహించారు. దీనికి 163 దేశాలకు చెందిన ఆరు వేల ఉన్నత పాఠశాలలకు చెందిన 13 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. పెయింటింగ్, మ్యూజిక్, జనరల్ నాలెడ్జ్, సైన్స్, లిటరేచర్, వివిధ రంగాలలో నిర్వహించిన పోటీలో ప్రతిభ ప్రదర్శించాడు. ద్వితీయ స్థానం సాధించి భారత్ ప్రతిష్టను ఇనుమడింపజేశాడు. ప్రతిభ చూపిన ఆదిత్యను పలువురు అభినందించారు. కాలిఫోర్నియా ఉంటున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పిడుగురాళ్ల: అసిస్టు సంస్థ, మా ఈఎన్‌టీ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని పాత గణేష్ పాడులో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 77 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీకాంత్, క్యాంపు కోఆర్డినేటర్ మధుకర్, ఆడియాలజిస్ట్ ఫరూక్, అసిస్ డెప్యూటీ డైరెక్టర్ పి.రవిబాబు పాల్గొన్నారు.

ఆటో ఓవర్ లోడ్‌పై కేసు నమోదు

నరసరావుపేటటౌన్: పరిమితికి మించి ప్రయాణికులను రవాణ చేస్తున్న ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ వంశీ కృష్ణ శనివారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటో అతి వేగంగా ప్రమాదకరంగా వెళ్తూ పట్టుబడిందన్నారు. ఈ మేరకు ఆటో డ్రైవర్ జొన్నలగడ్డకు చెందిన కుందా ఏసురత్నంపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

తలరాతలు నిర్ణయించేది ఓటు హక్కే



చిలకలూరిపేట: మన తలరాతలు నిర్ణయించేది ఓటు హక్కు అని... ఓటు అమ్ముకుంటే భవిష్యత్తు లేనట్టేనని తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ చెప్పారు. పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో శనివారం నా ఓటు–నా హక్కు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాదెండ్ల తహసీల్దార్‌గా చంద్రశేఖర్



నాదెండ్ల: మండల తహసీల్దార్‌గా ఎస్ చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి జిల్లా గూడూరు తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై నాదెండ్లకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన ఏవీ రమణ నరసరావుపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సి–సెక్షన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. యడ్లపాడు మండలం నుంచి డిప్యూటేషన్‌పై నాదెండ్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఏవీ రమణ కేవలం ఎనిమిది నెలల్లోనే బదిలీ కావటంపై రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ళ కారణంగానే బదిలీ జరిగినట్లు సమాచారం.

గణపవరం బిల్‌కలెక్టర్‌గా కరీంబాషా

నాదెండ్ల: మేజర్‌పంచాయతీ గణపవరం గ్రామంలో ఐదేళ్ళుగా ఖాళీగా ఉన్న బిల్‌కలెక్టర్ పోస్టు భర్తీ అయింది. ఈ మేరకు శనివారం చేబ్రోలు పంచాయతీలో బిల్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న కరీంబాషా బదిలీపై వచ్చి విధుల్లో చేరారు.

పోలింగ్ బూత్‌లలో సదుపాయాలు కల్పించాలి

మాచర్ల రూరల్: నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులతో పాటు ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల తగిన సదుపాయాలు కల్పించాలని పులిచింతల ప్రాజెక్టు డెప్యూటీ కలెక్టర్, ఆర్‌ఓ బి.గాయత్రీదేవి పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చనిపోయినవారిని గుర్తించి వేర్వేరు చోట్ల ఓట్లు నమోదై ఉన్న వారిని ఏరివేతతో పాటు ముఖ్యంగా పోలింగ్ బూత్‌లలో ప్రజలకు అందించాల్సిన సదుపాయాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో నివసించే ప్రజలకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, 1200 ఓట్లు దాటిన కేంద్రాలలో మార్పులు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో బీఎల్‌ఓలకు మాస్టర్ ట్రెనింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. దీనికి అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని సూచించారు. అనంతరం పట్టణ, గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బి.కిరణ్ కుమార్, షేక్ బాషా, మేరి కనకరత్నం, ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, ఫణీంద్ర కుమార్, మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వరరావు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ కలెక్టర్ గాయత్రీదేవి

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో జాప్యం వద్దు

గురజాల: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా పోలింగ్ స్టేషన్‌లలో కనీస వసతులు కల్పించాలని ఆర్డీఓ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో తహసీల్దార్లు, ఎలక్షన్ ఆఫీసర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ 1200 కంటే ఎక్కువ ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని కోరారు. ఓటర్ల నివాస ప్రాంతానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని చెప్పారు. సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయడం వంటివి చేయాలన్నారు. జూలై 3 నుంచి 17వ తేదీ వరకు జరిగే నియోజకవర్గంలోని ప్రతి బీఎల్‌ఓకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ

ప్రతి మనిషికి యోగా అవసరం

మాచర్ల: యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే జేబీఆర్ యోగా ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, వైస్ చైర్మన్ తేరాల సిద్దమ్మ, ఎంఈఓ అల్లి సురేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, వైద్యులు మోహన్‌రావు, వెంకయ్య పాల్గొన్నారు. పురపాలక సంఘ కమిషనర్ డి.వేణుబాబు పర్యవేక్షించారు.



యోగా చేస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్, అధికారులు

యోగాతో మానసిక ప్రశాంతత

గురజాల: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నగర పంచాయతీ కమిషనర్ వై.శివన్నారాయణ అన్నారు. స్థానిక దూబచెరువు వద్ద నగర పంచాయతీ కమిషనర్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. సబ్ జైలులో సబ్ జైలర్ అచ్చినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.

కోర్టు ఆవరణలో యోగా దినోత్సవం

మాచర్ల: మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి యోగా గురువులు మెట్టు గోవిందరెడ్డి అధ్యక్షత వహించారు.

లాంచీస్టేషన్‌లో..

విజయపురిసౌత్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్థానిక లాంచీ స్టేషన్‌లో విద్యార్థులతో కలిసి పర్యాటక శాఖ ఉద్యోగులు యోగాసనాలు చేశారు. అనంతరం లాంచీ స్టేషన్ ఆవరణలో ఉద్యోగులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ఉద్యోగులు వినయతుల్లా, రామారావు, రాజేష్, శ్రీను, ప్రభాకర్, రమణ పాల్గొన్నారు.

యోగా ఎంతో ఆరోగ్యకరం

మాచవరం: ప్రతి ఒక్కరు యోగా చేయడం వలన నిత్య జీవితంలో ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారని పలువురు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగమల్లేశ్వరావు, ఎంపీడీఓ విష్ణు చిరంజీవి, ఎస్ఐ తిరుపతిరావు, ఎంఈఓ డి.శ్రీధర్, ఈఓపీఆర్‌డీ వెంగళరావు పాల్గొన్నారు.

రెంటచింతల మండలంలో

రెంటచింతల: మండలంలో యోగా దినోత్సవం నిర్వహించారు. శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాలలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో విద్యాశాఖాధికారి వై.శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

దాచేపల్లి మండలంలో...

దాచేపల్లి: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో యోగా డే నిర్వహించారు.

పిడుగురాళ్లలో

పిడుగురాళ్ల: యోగాతో ఆరోగ్యానికి మేలు అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మార్కెట్ యార్డ్ లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొనడం జరిగింది.

మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యం

ఎస్ఈ విజయ్‌కుమార్

మాచర్ల: వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. దుర్గి మండలంలోని 33/11, అడిగొప్పల, ధర్మవరం, దుర్గి, కోలగుట్ల సబ్ స్టేషన్‌లను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్, డొమెస్టిక్ దరఖాస్తులు, ఎస్సీ, ఎస్టీ కాకుండా ఉన్నటువంటి సర్వీసులు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. వలంటీర్, అడిషనల్ లోడ్ ఫర్ 55 శాతం రాయితీకి ఈ నెల 30లోపు అవకాశముందని చెప్పారు. రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కోరారు. ఈ సందర్భంగా దుర్గి సబ్ స్టేషన్‌లో ఎస్ఈ పత్తిపాటి విజయ్‌కుమార్, మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూతలపాటి సింగయ్య, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామయ్యతో కలిసి మొక్క నాటి పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడారు. అంతకుముందు సబ్ స్టేషన్‌లో ఉద్యోగులతో కలిసి కొద్దిసేపు యోగా చేశారు.



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ

ఎస్సీ కాలనీలో భూ సమస్యల పరిష్కారానికి దీక్ష

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులోని ఎస్సీ కాలనీ వాసుల ఇబ్బందులను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు జంగాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎస్సీ కాలనీ వాసుల ఇబ్బందులపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్కరాజుగార్లపాడు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ తరఫున శనివారం పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జంగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ... లక్కరాజు గార్లపాడు గ్రామసెంటర్ సర్వే నెంబర్ 114లో బావి పోరంబోకు ఆరు సెంట్ల భూమి ఉందని, సర్వే నెంబర్ 115లో ఎస్సీ కాలనీ రోడ్, ఆర్ అండ్ బీ రోడ్డుకు కనెక్షన్ ఉందన్నారు. సర్వే నెంబర్ 131లో గ్రామకంఠ భూమి ఉందని చెప్పారు. ఆ మూడు రకాల భూమిని కలుపుకోవడానికి తమ గ్రామంలో నలుగురు వ్యక్తులు కుట్రలు చేస్తూ ఎస్సీ కాలనీ వాసులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, డీఆర్‌ఓ సూచనల మేరకు సత్తెనపల్లి ఆర్డీవో ఈ ఫిర్యాదుపై విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనిపై ఆర్డీవో, తహసీల్దార్ సంయుక్తంగా కలిసి గ్రామంలో విచారణ జరిపారన్నారు. ఆ భూమి ప్రభుత్వానికి చెందిందని, ప్రైవేట్ వ్యక్తులు ఎవరికీ సంబంధం లేదంటూ అక్కడ గ్రావెల్ తోలిన వ్యక్తితో మాట్లాడి వివాదం లేకుండా చేసి, పంచాయతీ కాలువ, పంచాయతీ రోడ్డు కలుపుకొన్న వ్యక్తులకు చెప్పి గ్రావెల్ తీయించాలని సత్తెనపల్లి ఈఓపీఆర్డీకి సూచన చేశారన్నారు. కానీ ఈ ఆదేశాల అమలులో జాప్యం దేనికి సంకేతమని నిలదీశారు. ఎస్సీలు అంటే చిన్న చూపా? అని ప్రశ్నించారు. జంగాల శ్రీనివాసరావుకు మద్దతుగా జొన్నలగడ్డ వెంకట్రావు, వెల్లటూరు మరియదాసు, జొన్నలగడ్డ మదన్, యరసాని జయరావు, ముప్పవరపు నాగరాజ్, జొన్నలగడ్డ ఏసోబు, జొన్నలగడ్డ లింగయ్య, జొన్నలగడ్డ చంటిలు రిలే నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 114లో 6 సెంట్లు బావి పోరంబోకు స్థలాన్ని డాక్టర్ అంబేడ్కర్ పేరుతో గ్రంథాలయానికి కేటాయించాలని కోరారు. సర్వే నెంబర్ 115లో గ్రామ సెంటర్ ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ రోడ్డు గ్రామపంచాయతీ సైడ్ కాలువను కలుపుతూ గ్రావెల్ మట్టితో పూడ్చిన దాన్ని పూర్తిగా తొలగించాలన్నారు. గ్రామ సెంటర్ ఎస్సీ కాలనీ రోడ్డుకు ఆనుకున్న పంచాయతీ రోడ్డు అనగా శీలంనేని సాంబయ్య ఇంటి ముందు గల పంచాయతీ రోడ్డు కలుపుతూ గ్రావెల్ మట్టి తోలించారని చెప్పారు. దానిని కూడా శుభ్రంగా తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్కరాజుగార్లపాడు ఎస్సీ కాలనీవాసులు, తదితరులు ఉన్నారు.



దీక్షలో కూర్చున్న లక్కరాజుగార్లపాడు ఎస్సీ కాలనీ వాసులు

రేపు మెగా జాబ్ మేళా

మాచర్ల: గ్లోరియా ఆఫ్ ఆసియా అవార్డు పొంది, ఐ.ఎస్.ఓ సర్టిఫైడ్ సంస్థ వరల్డ్ వెల్ బీయింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ సాంబేలు శాంతి బాయి శనివారం తెలిపారు. పల్నాడు జిల్లా మాచర్లలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. టెక్ మహేంద్ర, జీఎంఆర్ ఎయిర్ పోర్ట్, కోటక్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, మెట్రో, పేటీఎం, జస్ట్ డయల్, బ్లింక్ ఇట్, కాప్సోన్, అక్షర ఎంటర్‌ప్రైజెస్, షైనీడార్ ఎలక్ట్రానిక్స్ వంటి ప్రతిష్టాత్మకమైన కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలన్నారు. జాబ్ మేళాలో విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ సెట్‌లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9885398475,8142656530 సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలి

అఖిలభారత యువజన సమాఖ్య ఏరియా కార్యదర్శి మల్లికార్జున్ డిమాండ్

చిలకలూరిపేట: సూపర్ సిక్స్‌లో భాగమైన నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని అఖిలభారత యువజన సమాఖ్య ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి చెల్లించాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నిరుద్యోగులకు భృతి చెల్లించకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. దీనికి తోడు నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ ఇప్పించి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించి నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఫ్ నాయకులు రవి, వెంకటేష్, లక్ష్మీపతి పాల్గొన్నారు.



సంతకాల సేకరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

సంధ్యారాణి మృతికి కారకులను అరెస్టు చేయాలి

కరపత్రాలు ఆవిష్కరించిన కేఎన్‌పీఎస్ నాయకులు

నరసరావుపేట: గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన చప్పిడి సంధ్యారాణి మృతికి కారణమైన ఆమె భర్త, అత్తమామలపై 304(బి) సెక్షన్ అమలుచేసి వారిని వెంటనే అరెస్టు చేయాలని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పోలీసు ఉన్నతాధికారులను కోరారు. దీనిపై శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు దగ్గర కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సంధ్యారాణిని అధిక కట్నం తీసుకురావాలని శారీరకంగా మానసికంగా వేధింపులకు గురి చేయడమే కాకుండా ఆమెపై దొంగతనం చేసిందని అవమానించి, అనుమానించిన కారణంగా మనస్థాపం చెందిన సంధ్యారాణి గతనెల 24న ఒంటిపై డీజిల్ పోసుకొని తగులబెట్టుకుందన్నారు. ఆమెను తల్లిదండ్రులు గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా 43 రోజులు మృత్యువుతో పోరాడి ఈనెల 5వ మరణించిందన్నారు. కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు నామమాత్రపు సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు ఆందోళన చేసిన తర్వాత 306 సెక్షన్‌గా ఆల్టర్ చేశారన్నారు. నిందితులను కాపాడుతున్న కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు నిర్లక్ష్యం వైఖరిని ఖండిస్తూ వచ్చే సోమవారం తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కేఎన్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేఎన్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్న ప్రసాదు, సహాయ కార్యదర్శి అక్కా బ్రహ్మయ్య, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.



కపత్రాలు ఆవిష్కరిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

రేపు సీపీఐ మహాసభ

రెంటచింతల: సీపీఐ మండల మహాసభ సోమవారం నిర్వహించనున్నట్లు మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహాసభలకు ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాదరావు, సహాయ కార్యదర్శి షేక్ హుసేన్, ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభలలో గ్రామస్థాయిలో సీపీఐ పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యచరణ వంటి కీలక అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి గుర్తింపు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని గుర్తించారు. ఈపూరు మండలం, ఈపూరు గ్రామానికి చెందిన గంజన బోయిన శ్రీకాంత్(23) గా గుర్తించినట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. శ్రీకాంత్ మృతదేహానికి నరసరావుపేట ఏరియా వైద్యశాలలో పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం వారి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

విత్తు మంచిదైతే.. పంట పండినట్టే!

ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. అన్నదాతలు పంట పొలాలు సిద్ధం చేస్తున్నారు. ఏ పంట సాగు చేయాలన్నా విత్తనమే కీలకం. నేలలో వేసే విత్తనం నాణ్యత కొరవడితే రైతుకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముంది. అలాంటప్పుడు విత్తన కొనుగోలు సమయంలోనే తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

- కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- విత్తన శుద్ధితో రైతులకు ఎన్నో ప్రయోజనాలు

ముప్పాళ్ళ: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా, నీటి లభ్యతను బట్టి పంటల సాగుకు అవసరమైన విత్తనాలు ఎంపిక చేసుకుంటే లాభదాయకంగా మారుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ముందుగా ఏ విత్తనాలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవాలి. వాటిల్లో నాణ్యమైనవి ఉపయోగిస్తే మొక్క ఆరోగ్యంగా పెరిగి తెగుళ్లను తట్టుకుంటుంది. నాసిరకం విత్తనం అయితే తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. విత్తనాలను గుర్తింపు పొందిన డీలర్ వద్దే కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్‌లపై ఉన్న సమాచారం పూర్తిగా చదవాలి. జన్యు, భౌతిక స్వచ్ఛత వివరాలు తెలుసుకోవాలి. 98% జన్యు స్వచ్ఛత ఉన్న విత్తనాలను కొంటే మంచిది. ప్యాకెట్‌లకు పసుపు, నీలం రంగు ట్యాగ్‌లు బ్రీడర్ విత్తనమా, ఫౌండేషన్ విత్తనమా అనేది తెలియజేస్తాయి. కొనుగోలు సమయంలో రశీదు తీసుకుంటే మొలక శాతం తక్కువగా ఉన్నా, నాసిరకం విత్తనమని తేలినా పరిహారం పొందడానికి వీలు ఉంటుంది.

మొలక శాతం పరీక్ష తప్పనిసరి

విత్తనాలు నాటే ముందుగా తప్పనిసరిగా మొలక శాతం పరీక్షించుకోవాలి. దాదాపు వంద విత్తనాలను తడి వస్త్రంలో వేసి రెండు నుంచి మూడు రోజులు ఉంచాలి. తర్వాత వాటిని పరీక్షిస్తే అందులో 95% మొలకలు కనిపిస్తే నాణ్యమైనవని భావించవచ్చు. నకిలీలను అరికట్టేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ విత్తనాల ప్యాకెట్‌లకు సంబంధించి కొత్త నిబంధనలు అమలులోకి తెచ్చింది. ప్యాకెట్‌లపై తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించింది. అందులో భాగంగా బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ ముద్రించేలా చర్యలు చేపట్టింది. వాటిని స్కాన్ చేస్తే విత్తనాలు ఎక్కడ, ఎప్పుడు ప్యాక్ చేశారు, ఏ ప్రయోగశాలలో పరీక్ష చేశారనే సమగ్ర వివరాలు తెలుస్తాయి. దీంతో నకిలీల బెడద అరికట్టే వీలుంది.



ముప్పాళ్ళ గ్రోమోర్ కేంద్రంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న విత్తనాలు

విత్తన శుద్ధితో రక్షణ

మేలు రకంతోపాటుగా విత్తన శుద్ధి కూడా చేస్తే తక్కువ ఖర్చుతో పంటను రక్షించుకోవచ్చు. నేల ద్వారా వ్యాపించే తెగుళ్లు, పురుగును సమర్థంగా నివారించడానికి ఇది దోహదపడుతుంది. శుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకొనిపోయి శిలీంధ్రాలను నాశనం చేస్తాయి. కిలో విత్తనానికి గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధిలో తగిన మోతాదులో మాత్రమే మందులు వాడాలి. మించితే మొలక శాతం దెబ్బతింటుంది. శుద్ధి చేసేటప్పుడు గింజ పగలకుండా, పైపొర పోకుండా చూసుకోవాలి. రైతులు తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు, ముఖానికి వస్త్రం కట్టుకుని ఈ పని చేయాలి.

నాడు అన్నివిధాలా అండ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గంలోనూ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌ల ద్వారా ఉచితంగా విత్తనాలు, ఎరువుల నాణ్యతలను పరీక్షించుకునేలా చర్యలు చేపట్టారు. ఆనాటి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సాగుపై రైతుల్లో నమ్మకం పెరిగింది. ఆ దిశగా రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ శాఖ ద్వారా నాణ్యమైన ప్రముఖ కంపెనీల విత్తనాలను సరఫరా చేశారు. అన్ని విధాలా సాగు ధీమా కల్పించేలా చర్యలు చేపట్టి వ్యవసాయాన్ని ప్రోత్సహించారు.

పంట కాలం తక్కువ ఉన్నవే ఎంతో మేలు



రైతులు తక్కువ కాలంలో పంట వచ్చే రకాన్ని ఎంచుకోవాలి. గత నాలుగేళ్లుగా అధిక దిగుబడులు వచ్చే రకాలను ఎంపిక చేసుకుంటే మంచిది. పత్తి విత్తనాల ప్యాకెట్‌పై జెనిటిక్ ఇంజినీరింగ్ అప్రూవల్ కమిటీ ఆమోదముద్ర తప్పనిసరిగా ఉన్నవాటినే ఎంచుకోవాలి. విత్తన ప్యాకెట్‌పై స్వచ్ఛత, మొలక శాతం, గడువు తేదీ పరీక్షించాలి. గ్లైసిల్ బీటీ విత్తనాలను అమ్మినా, కొనుగోలు చేసినా నేరంగా పరిగణిస్తారు. ఒకే రకం విత్తనం కాకుండా రెండు మూడు రకాలను సాగు చేసుకుంటే మేలు. కొత్త విత్తనం సాగు చేసుకోవాలంటే తక్కువ విస్తీర్ణంలో నాటుకొని నాణ్యత, సదరు నేలకు అనుకూలమో.. కాదో.. నిర్ధారించుకోవాలి.

–ఎం.శివకుమారి, డీడీఏ, జిల్లా వనరుల కేంద్రం, పల్నాడు

శావల్యాపురంపశువైద్యాధికారిగా కావ్య



శావల్యాపురం: స్థానిక పశువైద్యశాల వైద్యాధికారిగా నూతనంగా జర్మి కావ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. తెనాలి రూరల్ మండలం అంగలూరులో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కావ్యను పశువైద్యశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన పశువైద్యాధికారి సోముల గుణధీర్ సాధారణ బదిలీపై నంబూరు పశువైద్యశాలకు వెళ్లారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న పశువైద్యాధికారి పాలపర్తి గణేష్ కుమార్ కారుమంచి, వేల్పూరు పశు వైద్యశాల్లో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.